అల్లూరి సీతారామరాజు

ఎట్టకేలకు మునినిగుంట వార్డెన్ సస్పెన్షన్

ప్రజశక్తి-రాజవొమ్మంగి

దేవీపట్నం మండలం మునినిగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు మృతి చెందిన నేపథ్యంలో ఎట్టకేలకు ఆ పాఠశాల వార్డెన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ పాఠశాలలో ఇద్దరు గిరిజన విద్యార్థినులు వారం రోజులు వ్యవధిలో మృతి చెందడంతో ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. గిరిజన విద్యార్థినుల మరణాలకు సంబంధించి బాధ్యుతలపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో, ఈ ఘటనలపై అధికారులు విచారణ నిర్వహించారు. విచారణలో భాగంగా హాస్టల్ వార్డెన్ సత్యవతిని సస్పెండ్ చేయడంతో పాటు పాఠశాల హెచ్ఎం రాజేశ్వరిని వేరే పాఠశాలకు బదిలీపై పంపినట్లు రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం మునినిగుంట ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులంతా ఎవరు ఇళ్లకు వారు వెళ్లిపోవడంతో పాఠశాల అంతా నిర్మానుష్యంగా మారింది.

శిశు మరణాలకు సిబ్బందిదే బాధ్యత

ఐసిడిఎస్, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలి

అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో శిశు మరణాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, వాటికి సంబంధిత వైద్యఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బంది బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో కలక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ చేయకపోవడం, తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహనలో వైఫల్యం, ఇతరత్రా అంశాలు శిశుమరణాలపై ప్రధానంగా ప్రభావం చూపుతున్నాయన్నారు. వాటిని అధిగమించటానికి వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ పరస్పర సహకారం, సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి శిశు మరణం నమోదు కావాలని, మరణాలను విశ్లేశించాలని ఆదేశించారు.

ఆశా కార్యకర్త ప్రతి నెలా నాలుగు సార్లు బాలింతల ఇంటికి వెళ్లాలని, వారికి అవగాహన కల్పించాలని, వారు సందర్శించినట్లు ధ్రువపత్రం సమర్పించాలని ఆదేశించారు. బాలింతల ఇళ్ళను సందర్శించకపోతే సంబంధిత ఆశా కార్యకర్తలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బిడ్డలకు బాలింతలు ఎలా తల్లి పాలు పట్టాలి, ఏ పొజిషన్‌లో ఉంచాలనే ప్రాథమిక అంశాలను కూడా వారికి వివరించాలని సూచించారు. తల్లి పాలు లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు వారికి సూచించాలని ఆదేశించారు. ముఖ్యంగా తల్లిపాలు సరైన రీతిలో పట్టకపోవటం, వ్యాక్షిన్ వేయకపోవటం వంటి కారణాలతో శిశువుల్లో రోగనిరోధకశక్తి తగ్గి మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు

రంపచోడవరం డివిజన్ పరిధిలో గడచిన నాలుగేళ్లలో ఇటువంటి చర్యలను సమర్థవంతంగా చేపట్టడంతో అక్కడ శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ, అంగన్వాడీ అధికారులు మండలస్థాయిలో సమీక్షలు నిర్వహించాలని, అవసరమైతే అందరికీ శిక్షణలు ఇవ్వాలన్నారు. శిశు మరణాలు లేకుండా చేసేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. ప్రతి చిన్న కేసును కెజిహెచ్‌కు రిఫర్ చేయడం సరికాదని, ఎందుకు రిఫర్ చేస్తున్నారో సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, వైద్యాధికారులు, సిడిపిఒలు గ్రామాల్లో తరచూ పర్యటించి, శిశు మరణాల నివారణకు అప్రమత్తం చేయాలన్నారు. నాటుమందులతో చనిపోతే సంబంధిత నాటు వైద్యుడిని బాధ్యుడిని చేయాలన్నారు.

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, గర్భిణులకు తొమ్మిది నెలల్లో ఒక్కసారైనా స్కానింగ్ చేయించాలని, తల్లీబిడ్డ ఆరోగ్యపరిస్థితిపై అంచనాకు రావడంతోపాటు ప్రసవ తేదీపై అంచనాకు వచ్చి వారిని అప్రమత్తం చేయాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు నిరంతరం ట్రాక్ చేయటం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని, సకాలంలో ప్రసవానికి ఆసుపత్రికి చేర్పించాలని, అవసరమైతే బర్త్ వెయిటింగ్ హాల్స్‌ను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

విశాఖపట్నం ఎఎన్ఎం శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాతమాట్లాడుతూ, ప్రతి శిశు మరణాన్ని విశ్లేషించి, కారణాలు తెలుసుకోవాలని, డెత్ ఆడిట్ ద్వారా వాటిని అధిగమించటానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అందరూ సక్రమంగా పనిచేయాలని, తద్వారా గర్భిణులు, బాలింతలను ట్రాక్ చేయటం, అవగాహన కల్పించటం చేయాలని సూచించారు. సమీక్షలో అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ లీలాప్రసాద్, పిహెచ్‌సి వైద్యాధికారులు, సిడిపిఒలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ర తోకవలస పాఠశాలను కొనసాగించాలి

సిపిఎం నాయకులు రామారావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ండలంలోని శిరగం పంచాయతీ వర్రతోకవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు డిమాండ్ చేశారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్నారని ఈ పాఠశాలను మూసేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. మంగళవారం పాఠశాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, గ్రామంలో 30 కుటుంబాలు జీవిస్తున్నారని, తొమ్మిది మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలను మూసేస్తే వారంతా చదువుకు దూరమై డ్రాపౌట్స్ కావడంతోపాటు నిరక్షరాస్యులుగా మిగిలిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంస్కరణల్లో భాగంగా నూతన ఎడ్యుకేషన్ పాలసీ పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతంలోని ఒక్కొక్క ప్రభుత్వ పాఠశాలలను మూసేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు.గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూసివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా స్థానిక ప్రజా ప్రతినిదులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మన్యవాసుల ఓట్లతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు పాఠశాలల మూసివేతపై తమ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు

ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ముడిపెట్టి పాఠశాలలను మూసేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు చిన్నయ్య, మల్లేష్, స్వామి,గుండు, మహేష్ పాల్గొన్నారు.

బాధ్యులపై సస్పెన్షన్ ఎత్తేస్తే ఊరుకోం

బాధిత కుటుంబీకులు, యు.బొడ్డాపుట్టు గ్రామస్తుల ఆందోళన

ఆందోళన చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు,గ్రామస్తులు

ప్రజాశక్తి -హుకుంపేట:విద్యుత్ స్తంభం పడి, విద్యార్థిని దుర్మరణం ఘటనలో బాధ్యులైన ముగ్గురిపై అధికారులు తీసుకున్న శాఖాపరమైన సస్పెన్షన్ చర్యలను వెంటనే ఎత్తేస్తే ఊరుకునేది లేదని బాధిత కుటుంబీకులతోపాటు ఉ్రాడ బొడ్డాపుట్టు గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. గిరిజన ఉద్యోగుల సంఘం కలెక్టర్‌ను కలిసి, బాధ్యులపై చర్యలను ఉపసంహరించుకోవాలని విన్నవించిన నేపథ్యంలో బాధితులు ఆందోళన చేపట్టారు.అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని తాడిపుట్టు పంచాయతీ, ఉ్రాడ బొడ్డాపుట్టు పాఠశాలలో స్తంభం పడడంతో ఒకటో తరగతి విద్యార్థినితూబూరు దన్విత మృతి చెందిన ఘటన తెలిసిందే. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలక్టర్ సుమిత్‌కుమార్ ఘటనకు ఎంఇఒ ఎన్.రామచంద్రరావు, హెచ్ఎం జంపరంగి ప్రసాద్, తాడేపుట్టుసచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.శ్రీలక్ష్మిలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కాగా ఉ్రాడ బొడ్డాపుట్టు పాఠశాల ఘటనలో కలెక్టర్ తీసుకున్న శాఖాపరమైన చర్యలపై గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు కలెక్టర్‌ను కలిసి, ఎంఇఒ, హెచ్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ ఎత్తేయాలని విన్నవించారు.దీన్ని సీరియస్‌గా తీసుకున్న బొ్రాపుట్టు గ్రామస్తులు,బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు.

బాధిత కుటుంబానికి న్యాయం జరగకుండా,ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్న భరోసా లేకుండా బాధ్యులపై సస్పెన్షన్ ఎత్తేస్తే ఉద్యోగుల్లో ఉదాసీనతకు దారితీస్తుందని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం చేయాలని, అంతవరకు సస్పెన్షన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాదూ కూడదని ఎత్తేస్తే గ్రామస్తులంతా మూకుమ్మడిగా వెళ్లి కలెక్టరేట్, ఐటిడిఎల వద్ద ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. విద్యార్థిని మృతి ఘటనలో బాధిత తల్లిదండ్రులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టి .సత్యనారాయణ, మజ్జి లక్ష్మణరావు పద్మావతి, చిన్న తల్లి, విశ్వనాథం, మత్స్యరాజు, కొండబాబు, లక్ష్మీపార్వతి, వార్డు సభ్యురాలు కేశమ్మ, మృతి చెందిన విద్యార్థిని దన్విత తల్లిదండ్రులు కోటిబాబు, భవాని, లక్ష్మి, సన్ని బాబు వెంకటరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

నెట్ సిగ్నల్ లేక నిలిచిన యూనియన్ బ్యాంకు సేవలు

- ఇబ్బంది పడ్డ ఖాతాదారులు
- పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి
- జాతీయ రహదారి నిర్మాణ పనులతో తరచూ తెగిపోతున్న కేబుల్స్

యూనియన్ బ్యాంకు ముందు నిరీక్షిస్తున్న ఖాతాదారులు

ప్రజశక్తి-రాజవొమ్మంగి

మండలంలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ లేకపోవడంతో స్థానిక యూనియన్ బ్యాంక్ సేవలు మంగళవారం నిలిచిపోయాయి. దీంతో బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని జడ్డంగి నుండి కాకరపాడు వరకు నేషనల్ హైవే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. హైవే నిర్మాణ పనుల్లో భాగంగా బిఎస్ఎన్ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్స్ తెగిపోవడంతో తరచూ బిఎస్ఎన్ఎల్ సిగ్నల్‌కు అంతరాయం ఏర్పడుతుంది. బ్యాంకు సేవలతో పాటు, ప్రభుత్వ కార్యాలయ సేవలు కూడా నిలిచిపోతున్నాయి. దీంతో మండల వాసులు ఆయా ప్రభుత్వ కార్యాలయ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చి పనులు జరగకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుతిరగాల్సి వస్తుంది. మండలంలోని 19 పంచాయితీలు ఉండగా సుమారు 35 వేల జనాభా ఉన్నారు, వీరందరికీ మేజర్ పంచాయతీ అయిన రాజవొమ్మంగిలో ప్రధాన కార్యాలయాలు ఉండడంతో నిరంతరం రాజవొమ్మంగి గ్రామానికి వేలాది మంది ప్రజలు వస్తూ పోతూ ఉంటారు. అందులో ప్రధానంగా యూనియన్ బ్యాంక్ ఒకటి. ఈ బ్యాంకులో వేలాది మందికి ఖాతాలు ఉండగా, ప్రతిరోజు 200 మంది ఖాతాదారులు వస్తుండగా, రూ 50 లక్షల వరకు బ్యాంకు ద్వారా వివిధ లావాదేవీలు జరుగుతుంటాయి. మంగళవారం బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లిచిపోవడంతో ఉదయం 11 గంటల నుండి ఈ బ్యాంకు ద్వారా ఎటువంటి లావాదేవీలు జరగలేదు. దీంతో ఎక్కువగా డబ్బులు అవసరం ఉన్న ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నిర్మాణ పనుల్లో బిఎస్ఎన్ఎల్ కేబుల్స్ కట్ అవడంతో వాటిని 24 గంటల లోపల సిబ్బంది సరి చేయాల్సి ఉంది. సిబ్బంది రాజవొమ్మంగి రావాలంటే సుమారు 100 కిలో మీటర్లు దూరం ఉన్నా కాకినాడ నుండి ఇక్కడికి రావాల్సి వస్తుంది. దీంతో తీవ్ర జాప్యం జరగడం వల్ల యూనియన్ బ్యాంకుకు వేరే నెట్ వర్క్ అవకాశం లేకపోవడంతో వివిధ సర్వీసులకు వచ్చే బ్యాంక్ ఖాతాదారులు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏటీఎం కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో డబ్బులు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులు కోసం ఖాతాదారులు ప్రైవేటు ఏటీఎంల వద్ద క్యూకడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ ఏటీఎం నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు కూడా అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి బ్యాంకు సేవలు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మంచంపై కూర్చొబెట్టి మోసుకొస్తున్న బంధువులు, వైద్య సిబ్బంది

వైద్య సిబ్బంది చొరవతో ఆసుపత్రిలో ప్రసవం

- డోలీ ద్వారా తరలింపు

ప్రజాశక్తి -సీలేరు

నవ మాసాలు నిండిన గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసుకోవడానికి నిరాకరించగా, వైద్య సిబ్బంది చొరవ తీసుకొని ఆమె ఆసుపత్రికి తరలించి ప్రసవం చేశారు. జికె.వీధి మండలం దుప్పిలవాడ పంచాయతీ పరిధి గాలికొండలో జరిగిన ఈ సంఘటకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... గాలికొండ గ్రామంలోని పిటికి తెగకు చెందిన గర్భిణి గిల్లూరి దేవికి మంగళవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆశా కార్యకర్త బంగారి ఆసుపత్రిలో కాన్పు వేయించుకోవాలని కౌన్సిలింగ్ చేసింది. అయినప్పటికీ ఆసుపత్రి రావడానికి దేవి నిరాకరించారు. దీంతో ఆశా కార్యకర్త సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ త్రినాధ్‌కి తెలియజేశారు. వెంటనే ఆయన సిబ్బందితో కలిసి గాలికొండ చేరుకొని గర్భిణి దేవిని సీలేరు ఆస్పత్రికి తీసుకురావాలని వారి బంధువులకు సూచించారు. అయినా ఆమె వినకపోవడంతో గత్యంతరం లేక స్థానిక ఎస్సై రామకృష్ణకు వైద్య సిబ్బంది సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఎస్ఐ గర్భిణి దేవికి, వారి కుటుంబ సభ్యులకు ఫోన్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. దీంతో దేవి కుటుంబ సభ్యులు సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు చేయించడానికి అంగీకరించారు. అయితే ఆమెను వాహనంలో ఆసుపత్రికి తీసుకురావడానికి గాలికొండ గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో హెల్త్ సూపర్వైజర్ త్రినాధ్ సూచన మేరకు గ్రామస్తులు దేవిని మంచంపై కూర్చొబెట్టి ఆసుపత్రికి తీసుకొచ్చారు. దేవి ఆసుపత్రిలో పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. దీంతో గిల్లూరు దేవి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

పుట్టిన బిడ్డతో తల్లి దేవి

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

చిన్న పరిశ్రమలకు రుణాలు

- ఐటిడిఎ పిఒ సూరజ్ గోనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

అర్హులైన యువతి యువకులు పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు సమర్పిస్తే చిన్న పరిశ్రమల శాఖ ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గోనోరే పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన బ్యాంకు మేనేజర్లు, ఎపియంలు, డిపియంలు, చిన్న పరిశ్రమలకు దరఖాస్తుల చేసుకున్న దరఖాస్తుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ 8వ తరగతి ఆపై చదువుకున్న యువతి యువకులకు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు పీఎంఈజీపి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు బ్యాంక్ సివిల్ స్కోర్‌ను బట్టి సబ్సిడీపై అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీలోని అన్ని గ్రామాలలో వివిధ రకాలైన వ్యాపారాలు చేసుకొనుటకు ఎవరైనా దరఖాస్తులు చేసుకుంటే రుణాలు మంజూరు చేయుటకు సంబంధిత బ్యాంకు మేనేజర్లతో సంప్రదించాలని సూచించారు. రుణం మంజూరైన తర్వాత వివిధ షాపుల్లో లోగో కూడా పెట్టాలన్నారు. జీఎస్టీ సర్టిఫికెట్ ఉన్న వారి దగ్గర నుండి మాత్రమే కొటేషన్లు తీసుకురావాలన్నారు. రెంటు షాపుల్లో వివిధ రకాలైన యూనిట్లు ఏర్పాటు చేసుకొనుటకు షాపు యజమాని దగ్గర నుండి అగ్రిమెంట్ పత్రాలు సమర్పించాలని సూచించారు. శిక్షణ పొందిన దరఖాస్తుదారులకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందన్నారు. రుణాలు మంజూరు చేయుటకు బ్యాంకు మేనేజర్లకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న పరిశ్రమల శాఖ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవితేజ, బ్యాంకు మేనేజర్ల ఎం.శ్రీనివాసరావు, రాజ్ కిషోర్, డిపియంలు పరమేశ్వరరావు, అపర్ణ, పియంఇజిపి యాంకర్ పర్సన్ రామరాజు, ఏపీఎంలు అప్పారావు, శ్యాం కుమార్, మధు, జేమ్స్, సూరమ్మ, రాజు, ఆదినారాయణ, దరఖాస్తుదారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఖూనీ

టిడిపి కార్యాలయంపై దాడిని ఖండిస్తూ నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -జి.మాడుగుల : రాష్ట్రంలో వైసిపి అరాచకపాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఖూనీ అయిపోతున్నాయని, ప్రజలకు, రాజకీయపార్టీలకు ఎక్కడా రక్షణ లేని పరిస్థితి ఉందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొమ్మెలి చిట్టిబాబు మండిపడ్డారు. కృష్ణాజిల్లా గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసిపి గూండాల దాడిని వ్యతిరేకస్తూ మంగళవారం మండల కేంద్రంలో టిడిపి శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని, అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అభివృద్ధి ఇసుమంతైనా లేకపోగా, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయని, ప్రశ్నించే వ్యక్తులు, పార్టీలపై పోలీసుల అండగా దాడులకు పాల్పడుతూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

విపక్ష నేతలపై వ్యక్తిగత దూషణలు, దాడులకు అంతేలేకుండా పోయిందని, బాహాటంగా ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులకు పాల్పడుతూ విధ్వంసం సృష్టిస్తున్నారని ఆరోపించారు. దాడులు చేసేవారిని వదిలేసి, బాధితులపై కేసులు బనాయించే విషసంస్కృతి దారుణమన్నారు. దాడులు చేయడమే కాకుండా వాటిని బహిరంగంగా సమర్థిస్తున్న వైసిపి ప్రజాప్రతినిధుల చర్యలు దుర్మార్గమైతే, వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేని నిస్సహాయస్థితిలో పోలీసు, అధికారయంత్రాంగం ఉండడం రాష్ట్ర శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. నిరసనలో పలువురు సీనియర్ నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మఠం మత్స్యలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఉత్సవం ముగింపు సందర్భంగా స్థానిక జ్ఞానసాగర్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ సిబ్బంది విద్యార్థుల ఆధ్వర్యంలో శివలింగాల ప్రదర్శన చేపట్టారు. మూడవ రోజు జరిగిన ముగింపు ఉత్సవంలో గిరిజన సంప్రదాయ నత్యాలు ప్రదర్శించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ వేడుకలో కళాశాల వ్యవస్థాపకులు బ్రహ్మకుమారి కేదార గౌరి, సునీత, శాంతి కుమారి పాల్గొన్నారు.

లంపీ చర్మవ్యాధిపై స్పందించిన అధికారులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు లంపి చర్మవ్యాధి సోకడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారని ప్రజాశక్తి మంగళవారం కథనం ప్రచురించిన నేపథ్యంలో పశు వైద్య అధికారులు స్పందించారు. జీకే వీధి మండలం సీలేరు దారకొండలో పశు వైద్య సిబ్బంది జ్యోతి తదితరులు మంగళవారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సీలేరులో పశువులకు లంపీ వ్యాధి లక్షణాలు ఉన్నాయా లేదే అని పశువులకు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది జ్యోతి మాట్లాడుతూ వైద్యాధికారి రాజశేఖర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేసినట్లు చెప్పారు. లంపీ సోకితే పశువుల చర్మంపై పెద్ద పెద్ద బొబ్బిల్లా ఏర్పడి అవి చిట్లి రక్తం కారుట తదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలపై గిరిజనులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ లో సీలేరు పంచాయతీ పరిధిలో 792 దారకొండ పంచాయతీ పరిధిలో 2000కు పైగా పశువులకు వివిధ రకాల వ్యాక్సిన్లు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు సచివాలయ అనిమల్ అసిస్టెంట్ అనుష్క, తోమరాజు కృష్ణ, కాంతు తదితరులు పాల్గొన్నారు.

పశువులను పరిశీలిస్తున్న పశు వైద్య సిబ్బంది

40 ఏళ్ల తరువాత విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెం గ్రామం నుండి పొల్లూరు వరకు సుమారు మూడు కిలో మీటర్లు ఎపి జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది వీధి లైట్లు వేసి 40 ఏళ్ల తరువాత విద్యుత్ వెలుగులు తీసుకొచ్చారు. ప్రాజెక్టు కట్టిన తొలినాళ్ళలో ఈ వీధి దీపాలు ఉండేవి. కాలక్రమేణా ఇవి పాడైపోయాయి. వాటిని పట్టించుకునే వారు లేరు. దీంతో జెన్‌కో ఉద్యోగుల విధి నిర్వహణకు ఇబ్బంది పడుతుండగా, గ్రామస్తులు చిమ్మచీకట్లో ఉంటున్నారు. సుమారు 40 సంవత్సరాల తర్వాత ఇప్పుడు వచ్చిన ఎపిజెన్కో అధికారులు మోతుగూడెం నుండి పొల్లూరు పవర్ ప్లాంట్ వరకు వీధి దీపాలు వేయడం జరిగింది. మోతుగూడెం ఎపిజెన్కో కాలనీలో కూడా వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. ఎస్‌టి కాలనీలో కూడా వీధి లైట్లు వేయాలని ఆలోచన చేస్తుంన్నారు. వీధి దీపాలు మరమ్మతులకు ప్రత్యేకమైన బడ్జెట్ వేసి కొత్త లైట్లు నిర్వహణకు అనుమతి ఇచ్చిన ఎపిజెన్కో ఛీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ఎస్ఇ వెంకటేశ్వరరావు, డిఇ భీమవరపు బాలకృష్ణ, సివిల్ ఇఇ బాబూరావుకు, డిస్ట్రిబ్యూషన్ ఎడిఇ, ఎఇ, కరెంటు ఉద్యోగులకు సర్పంచ్ ఆకేటి సీత, ఎంపిటీసి వేగి నాగేశ్వరరావు, మోతుగూడెం పొల్లూరు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వీధి లైట్లు వేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది

రవిబాబును అభినందిస్తున్న వైసిపి నేతలు

రవిబాబుకు శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకున్న రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబును మంగళవారం డుంబ్రిగుడ మండల వైసిపి నాయకులు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ నగరంలోని రవిబాబు ఇంటికి చేరుకుని రవిబాబును దుశ్శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల వైసిపి నేతలు మాట్లాడుతూ, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబును ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తూ సిఎం జగన్ ప్రకటించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, కిముడు హరి, బి.కె.నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు శెట్టి గోపాల్, పార్టీ సీనియర్ నాయకులు రామదాసు, రామునాయుడు, గొల్లోరి కేశవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చొక్కాకుల వెంకటరావు

గృహసారథులు, కన్వీనర్లకు శిక్షణ

ప్రజాశక్తి -జిమాడుగుల: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయడం ద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగాపనిచేయాలని పాడేరు నియోజకవర్గ వైసిపి పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు కోరారు.మంగళవారం జి.మాడుగులలో ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైఎస్‌ఎంపిపి-2 కుడుముల సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై చర్చా గోష్టి

ప్రజాశక్తి -లీగల్ విశాఖ : న్యాయవాదుల సమస్యలపై విశాఖ బార్ సోసియేషన్‌లో మంగళవారం చర్చా గోష్టి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు హాజరయ్యారు. న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్లపు వేణుగోపాల్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటుచేసి చర్చా గోష్టి సాగించారు. అనంతరం గంటా రామారావు మాట్లాడుతూ, న్యాయవాదుల సంక్షేమం కోసం హైకోర్టు పరిధిలో శిక్షణ అకాడమీ కోసం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని పదేపదే కోరినా స్పందించలేదన్నారు. రాష్ట్ర న్యాయవాదులంతా దీనిపై ఆలోచించి, బార్ కౌన్సిల్ ఆధ్వర్యాన స్థలాన్ని కొనుగోలు చేసి దాతల సహాయంతో న్యాయవాదుల శిక్షణ అకాడమీ భవనాన్ని నిర్మించాలన్న ఉద్దేశంలో ఉన్నట్లు వివరించారు. న్యాయమూర్తులకు శిక్షణ అకాడమీ ఉన్నట్లు న్యాయవాదులకు కూడా ఉండడం చాలా అవసరం అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుంచి రూ.12 కోట్లకు పైగా మ్యాచింగ్ గ్రాంట్ రాష్ట్ర న్యాయవాదుల సంఘానికి రావాల్సి ఉందని తెలిపారు. న్యాయవాదుల వెల్ఫేర్ స్టాంపు ఖరీదును ఇప్పుడున్న రూ.100 నుంచి రూ.200కు పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలియజేశారు. అనంతరం రామారావును విశాఖ బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణమోహన్, పి.నర్సింగరావు, ఆర్మ్ తోగేశ్వరరావు, నమ్మి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రమాప్రభ గెలుపునకు విస్తృత ప్రచారం

సోమలింగపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కర్రి అప్పారావు తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ ఆమె మద్దతుదారులు మంగళవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలోనే సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణను పిడిఎఫ్ అభ్యర్థి ప్రచార బృందం కలిసింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అవినీతి రహిత రాజకీయాలు కావాలన్నారు. సమాజ సేవకులు, మేధావులు చట్టసభల్లో ఉండాలని తెలిపారు. ప్రచారంలో పాల్గొన్న వారిలో సిపిఎం అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్, 250 సంఘాల బలపరిచిన అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ గెలుపు కోరుతూ మంగళవారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ఆధ్వర్యాన మండలంలోని సోమలింగపాలెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రలను, వారి తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కోరుబిల్లి సత్యనారాయణ, ఎల్లపు నూక నాయుడు, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ రోలుగుంట మండల కేంద్రంలో మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.గోవిందరావు, ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగావకాశాలు, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు, పెన్షనర్లు ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి, చట్టసభల్లో ఈ ప్రాంత ప్రజల వాణిని వినిపించాలంటే, సమస్యలపై అవగాహన, పోరాటతత్వం ఉన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. విద్యావంతులైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లంతా విజ్ఞతతో రమాప్రభకు ప్రధమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మడ్డు శ్రీరామ్మూర్తి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నూతన వేతనాల అమలుకు వినతి

సిఎమ్‌డి అతుల్‌భట్‌కు వినతిని అందిస్తున్న అయోధ్యరామ్ తదితరులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికులకు నూతన వేతనాలు అమలుచేయాలని విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి తగు సూచనలతో కూడిన ఆదేశాలను ఇవ్వాలని ఎన్‌జెసిఎస్ కన్వీనర్‌కు స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా రాసిన లేఖను సిఎమ్‌డి అతుల్‌భట్‌కు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రతినిధులు మంగళవారం అందించారు. లేఖలో లలిత్‌మిశ్రా పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి... 'దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు అక్టోబర్ 21 నూతన వేతన ఒప్పందం జరిగింది. ఒప్పంద సమయంలో ఎన్‌జెసిఎస్ కన్వీనర్‌గా మీరు ఉన్నారు. ఎన్‌జెసిఎస్‌లో భాగస్వామ్యంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులకు నూతన వేతనాలు ఇంత వరకు అమలు చేయలేదు. దీనిపై కన్వీనర్‌గా మీరు దృష్టి సారించి తక్షణం సమస్యను పరిష్కరించాలి' అని కోరుతూ లేఖ విడుదల చేశారు.

ఈ లేఖను సిఎమ్‌డికి ఆయన కార్యాలయంలో అందించిన అనంతరం స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, కార్మికులు అంకిత భావంతో పనిచేసి ఉత్పత్తిలో రికార్డులను సృష్టిస్తున్నారని తెలిపారు. తద్వారా పరిశ్రమ ఆర్థిక పరిస్థితి మరింత మెరుగవుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి తగిన వెసులుబాటు ఉందని తెలిపారు. ఆ దిశగా చర్యలు చేపట్టి కార్మికులను ఉత్సాహపరిస్తే ఉత్పత్తి, ఉత్పాదకతలలో కార్మికుల సామర్థ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి య. రామస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన నూతన పెన్షన్ విధానంపై కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దీనికి నూతన వేతన ఒప్పందం అమలు కాకపోవడం వల్ల తీవ్ర నష్టానికి గురి అవుతున్నారని వివరించారు. కార్మికుల ఆర్థిక నష్టాలను తగ్గించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, సెయిల్‌లో కార్మికుల నూతన వేతన ఒప్పందం అమలుతో పాటు బకాయిలను కూడా సెయిల్ యాజమాన్యం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను, అధికారులకు ప్రోత్సహించేందుకు యాజమాన్యం కృషిచేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ మాట్లాడుతూ, స్టీల్ కార్మికులు కృషి వల్ల నేడు ఉత్పత్తి, ఉత్పాదకతలు రికార్డు స్థాయిలో వస్తున్నాయని, తద్వారా పరిశ్రమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే దిశగా ఉందని తెలిపారు. ఈ విషయంపై స్టీల్ అధికారులతో చర్చిస్తానని చెప్పారు.

నేరాలు ఘోరాలు

రుషికొండ బీచ్‌లో యువకుని మృతదేహం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ బీచ్‌లో రాళ్లమధ్య ఇరుక్కుని ఉన్న యువకుడి మృతదేహం మంగళవారం బయటపడింది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... మారికవలసకు చెందిన ఎస్.యోగేష్ (22) ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ పూర్తిచేశాడు. తండ్రి ఉమామహేశ్వరరావు ఒడిశాలోని స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. మృతుడు అలిగి సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మంగళవారం మృతిచెంది కనిపించాడు. కుమారుడు మృతిచెందినట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. ఆరిలోవ పోలీసు కానిస్టేబుల్ రాజా, స్థానిక కమ్యూనిటీ గార్డులు సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి కెజిహెచ్ మార్చురీకి తరలించారు.

పలు దొంగతనం కేసులు ఛేదన

అరెస్టయిన వారిలో ఇద్దరు మైనర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమిలి, గాజువాక పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు దొంగతనం కేసులను పోలీసులు ఛేదించారు. ఆ వివరాలను మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి జి.నాగన్న వెల్లడించారు. భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు నెలల్లో జరిగిన ఎనిమిది దొంగతనం కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 15న భీమిలి చిన్న బజారుకు చెందిన కలిదిండి నుహార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ ఇంట్లోని రెండున్నర తులాల బంగారం చోరీకి గురైన విషయాన్ని తెలియజేశాడు. ఈ కేసుతో పాటు మరొక ఏడు కేసుల్లో ప్రమేయం ఉన్న ఇద్దరు జువైనల్ నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.16 లక్షలా 40 వేలు విలువైన 30.5 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన మరొక ఆరుగురు రిసీవర్లను కూడా అరెస్టు చేశారు. ప్రధాన నిందితులిద్దరూ 16, 17 సంవత్సరాలవారే. అందులో ఒకరు పదో తరగతి మధ్యలో మానేయగా, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. జల్సాలకు అలవాటు పడి వీరు ఈ దొంగతనాలకు పాల్పడినట్టు అధికారులు తెలిపారు.

వేరొక కేసులో గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. విజయనగరం గొర్ల గ్రామానికి చెందిన కనకం దామోదర్ ఈ కేసులో ప్రధాన నిందితుడని డిసిపి పేర్కొన్నారు. గతంలో 15 దొంగతనం కేసుల్లో నిందితునిగా ఉన్నాడని తెలిపారు. అతని నుంచి సుమారు 8 లక్షల విలువైన 39 సెల్‌ఫోన్లు, 2 లక్షల రూపాయల నగదు, ఒక లాప్‌ట్యాప్, తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పై రెండు కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిసిఎస్ భీమిలి, ఆనందపురం గాజువాక క్రైమ్ సిబ్బందిని నాగన్న అభినందించారు.

గంజాయి తాగుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ కెవిఆర్ పార్క్ సమీపంలో గంజాయి తాగుతున్న ఐదుగురు యువకులను స్టీల్ ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. నిందితుల నుంచి ఐదు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఇచ్చిన సమాచారం మేరకు లంకెలపాలెం, అగనంపూడి ప్రాంతాలలో ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 525 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసినవారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి త్రినాథ్, ఉక్కునగరం పోలీసులు తెలిపారు.

గీతంలో భట్నాగర్ జయంతి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతిని నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని భట్నాగర్ ప్రయోగశాలల వద్ద మంగళవారం జరిగిన రీసెర్చర్స్ డే కార్యక్రమంలో భట్నాగర్ విగ్రహం వద్ద గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వేదవతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజహితానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడాలన్నారు. భారత దేశం విజ్ఞాన శాస్త్ర రంగంలో అభివద్ధి చెందడానికి సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి పరిశోధకుల దూరదృష్టి కారణం అన్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనలు సామాన్యులకు చేరాలన్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్‌ను సైన్స్ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చి స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున పారిశ్రామిక పెట్టుబడులను రాబట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు పలువురు పారిశ్రామిక దిగ్గజాలు వస్తున్నట్టు చెప్పారు. వచ్చే నెల 3, 4 తేదీల్లో స్థానిక ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమ్మిట్‌కు రాష్ట్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలు, రాష్ట్రాల నుంచి పెట్టుబడిదారులను, పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించేందుకు పలు ప్రాంతాలలో రోడ్‌షోలు నిర్వహించామని తెలిపారు. సుమారు 40 నుంచి 45 దేశాలకు చెందిన ప్రతినిధులను విశాఖకు ఆహ్వానించామన్నారు. పలు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు కూడా సమ్మిట్‌కు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలని, భూమి, నీరు, విద్యుత్తు సక్రమంగా అందించాలని సిఎం ఆదేశించారని అమర్‌నాథ్ తెలిపారు. ఇప్పటికే సమ్మిట్‌లో పాల్గొనేందుకు 4800 మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు.

విశాఖలో అంతర్జాతీయ స్థాయిలో మార్చిలో జరగబోయే జి-20 సదస్సుకు చేపట్టాల్సిన అభివృద్ధి, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిడిఎంఎ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, ఎపి గ్రీన్ కార్పొరేషన్ ఎమ్‌డి రాజశేఖర రెడ్డిలతో కలిసి ఆమె నగరంలోని ర్యాడిసన్ హోటల్ నుంచి సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, సీతకొండ, పార్క్ హోటల్ జంక్షన్, ఎయు ఇన్ గేటు, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ సహా పలు ప్రాంతాల్లో పర్యటించారు. జి - 20 సదస్సుకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు తరలిరానున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి సంబంధించి మంగళవారం ముగ్గురు అభ్యర్థులు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తికి తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన బొడ్డేడ చంద్రకళ పద్మావతి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖపట్నం ఎంవిపి.కాలనీకి చెందిన కుందేటి సూర్య వెంకట సుభాష్ చంద్ర స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు గ్రామానికి చెందిన బండారు ఎస్‌విజె.ప్రతాప్ కుమార్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ నెల 16న నోటిఫికేషన్‌రాగా మంగళవారం నాటికి మొత్తం ఆరుగురు అభ్యర్థులు 10 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు అధికారులు తెలిపారు.

మందు బాబులకు వినూత్న శిక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో మందుబాబులకు వింత శిక్షను అమలు చేసింది మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆదివారం పట్టుబడ్డ 52 మంది మందుబాబులకు ఆర్కే బీచ్‌లోని వ్యర్థాలను, చెత్తను పరిశుభ్రం చేయాలని ఆదేశించింది. దీంతో మందుబాబులంతా వరుసగా ఆర్కే బీచ్‌లోకి వచ్చి చెత్తను శుభ్రం చేశారు. విశాఖలోని మెట్రోపాలిటిన్ కోర్టు వేసిన ఈ శిక్ష ఇపుడు ఉమ్మడి విశాఖ జిల్లాలో చర్చనీయాంశమైంది.

అమ్మకానికి తుమ్మపాల ?

ప్రభుత్వాలేవైనా తప్పని గండం

లిక్విడేటర్ నియామకంతో తొలగుతున్న భ్రమలు

రెండో దశలో ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల అమ్మకం

నోరు విప్పని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్

ఎమ్మెల్సీ ఎన్నికలయ్యాక అమ్మకపు ప్రక్రియ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

తుమ్మపాల (అనకాపల్లి వివి రమణ కో - ఆపరేటివ్) సుగర్ ఫ్యాక్టరీ అమ్మకానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. సుగర్ ఫ్యాక్టరీ ఆధునీకీకరణ అంశం రైతుల్లో తొలగిపోవడంతో, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పల్లవి అందుకొని ప్రచారంలో పెట్టింది. ఎన్నికల ప్రచారంలో సహకార సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరిస్తామని నమ్మించిన జగన్మోహన్‌రెడ్డి... అధికారం చేతికొచ్చాక ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్‌ను అర్థాంతరంగా నిలిపివేసి, రైతులకు దారీతెన్నూలేకుండా చేశారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలను ఒకేసారి అమ్మకానికి పెడితే జనంలో తిరగలేమనుకొని వాటిని ఒక్కొక్కటిగా అమ్మాలని చూస్తున్నారు. అందులో భాగంగానే రూ.450 కోట్లకు పైబడి స్థిరాస్తులు కలిగిన ఫ్యాక్టరీ ఆస్తులను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా లిక్విడేటర్‌ను ప్రభుత్వం నియమించింది. లిక్విడేటర్ నియామకంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నా అనకాపల్లి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాత్రం నోరువిప్పడంలేదు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాక ఫ్యాక్టరీ అమ్మకపు ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిసింది. టిడిపి ప్రభుత్వ కాలంలో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆ పార్టీ నాయకుడు ఎంవివిఎస్.మూర్తికి విక్రయించాలని చేసిన ప్రయత్నాలను రైతులు అడ్డుకున్నారు. తరువాత విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి తులసీరావుకు కట్టబెట్టాలని చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. ఫ్యాక్టరీ అమ్మకాలను ఆనాడు వ్యతిరేకించిన వైసిపి, ఇప్పుడు తుమ్మపాల సుగర్‌ను అమ్మకానికి పెట్టనుంది. ఫ్యాక్టరీలో రైతుల షేర్లు కంటే ప్రభుత్వ షేర్లు తక్కువ కావడంతో కో - ఆపరేటివ్ సుగర్ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీ ఆస్తుల అమ్మకానికి అవకాశంలేనప్పటికీ, ఈసారి ఎలాగైనా విక్రయించి సొమ్ముచేసుకోవాలన్న యోచనలో ప్రభుత్వమున్నట్లు తెలుస్తోంది.

ఇదీ ఫ్యాక్టరీ చరిత్ర

1935లో 50 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఏర్పాటై, వెయ్యి టన్నుల సామర్థ్యానికి తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ విస్తరించింది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో 9 మండలాలకు చెందిన 151 గ్రామాల నుంచి రైతులు చెరకు సరఫరా చేసేవారు. తమ వాటా కింద 12,769 మంది రైతులు రూ.కోటీ 36 లక్షలా 81 వేలా 300ను పెట్టారు. దీంట్లో ప్రభుత్వ షేర్ కేవలం లక్ష రూపాయలుండడంతో పథకం ప్రకారం తమ వాటాను పెంచుకొనే ప్రయత్నంలో భాగంగా, ఫ్యాక్టరీ మరమ్మతులు, రైతుల బకాయిల నిమిత్తం ఇచ్చిన రూ.19 కోట్లా 52 లక్షలా 43 వేల రుణాన్ని తన షేర్ కింద మార్చుకుంది. మరో రూ.20.45 కోట్లను అప్పు కింద కింద ప్రభుత్వం చూపుతోంది. అన్నీ సక్రమంగా ఉన్న కాలంలో క్రషింగ్ సీజన్ ముగిశాక ప్రభుత్వ మందుల కంపెనీ ఐడిపిఎల్ సహకారంతో స్థానికంగానే పారాసెట్మాల్ సహా మరో రెండు ట్యాబ్లెట్లు తయారుచేసి ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేసే ఖ్యాతిని నాడు తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ గడించింది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో మందుల తయారీ ఆగింది. తరువాత డిస్టలరీ యూనిట్ మూతపడింది. తొలుత 2015-16లో అప్పటి ప్రభుత్వం చెరుకు క్రషింగ్ ఆపింది. 2018-19 సీజన్‌లో తెరచి మళ్లీ క్రషింగ్ నిలిపివేసింది. ఇపుడా ఫ్యాక్టరీని చెరుకు రైతుల అవసరాలకు తగినట్లు ఈ ప్రభుత్వం ఆధునీకరించకపోగా గుండగుత్తుగా అమ్మకానికి పెడుతుండడం విమర్శలకు తావిస్తోంది.

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ (ఫైల్ ఫొటో)

నమ్మక ద్రోహం

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టే చర్యలను ప్రభుత్వం మానుకోవాలి. టిడిపి ప్రభుత్వం నుంచి వైసిపి ప్రభుత్వం వరకూ రైతులకు ద్రోహం చేస్తూనేవున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెడతామని కొంతకాలంగా చెప్పి ఇప్పుడు అమ్మకానికి పెట్టడం నమ్మక ద్రోహం. రైతుల ఆమోదం, జనరల్‌బాడీ సమావేశం నిర్వహించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా లిక్విడేటర్‌ను నియమించడం సరికాదు. ప్రభుత్వ చర్యలను రైతు సంఘాల నేతలు, కార్మికులు ఐక్యంగా పోరాడి అడ్డుకుంటారు. ప్రభుత్వం వెనక్కుతగ్గకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

- ఎ.బాలకృష్ణ, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

వాలంటీర్లతో జనసమీకరణ ఆపండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్‌కు వాలంటీర్లతో జనసమీకరణ చేసే ప్రయత్నాలను ఆపాలని జిల్లా కలెక్టరు, ఎన్నికల ప్రధాన అధికారి మల్లికార్జునను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాకు అజశర్మ ఓ ప్రకటన విడుదల చేశారు. వైసిపి అభ్యర్థి ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు బుధవారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా జన సమీకరణ చేయాలని వార్డు వాలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి వాలంటీరు కనీసం ఐదుగురిని తీసుకు రావాలని చెప్పినట్టు తెలిసిందన్నారు. గతంలో వీరి ద్వారానే అర్హత లేని వారికి కూడా ఓట్లు నమోదు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మరలా వారి సర్వీసులను అధికార పార్టీ నాయకులు దుర్వినియోగ పరుస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు పొందుతున్న వారిని ఇలా ఒక పార్టీకి అనుకూలంగా చేయాలని ఒత్తిడి తేవడం ఎన్నిక నియమావళికి విరుద్ధమన్నారు. ఇలాంటి వాటిని అనుమతిస్తే ఇక ఎన్నికలు ప్రజాస్వామ్య వాతావరణంలో జరిగే అవకాశమే ఉండదన్నారు. ఈ నేపథ్యంలో కలగచేసుకుని తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. వాలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ జేబు సంస్థగా మారకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఇంజనీర్లు, విద్యుత్ కళాభారతి కళాకారులు

నటుడు లక్ష్మీనారాయణకు సన్మానం

ప్రజాశక్తి - సీలేరు : తిరుపతిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఎంపికైన ఈఈ లక్ష్మీనారాయణను మంగళవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో నాటిక పోటీల్లో ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ కళాకారులు ప్రదర్శించిన "ఇదోగది" నాటిక ఉత్తమ నాటికగా ఎంపి కావడంతో పాటు, ఈఈ లక్ష్మీనారాయణ ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఎంపికైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక ఏపీ జెన్కో ఇంజనీర్లు సీలేరు విద్యుత్ కళాభారతి కళాకారులు స్థానిక జల విద్యుత్ కేంద్రంలో మంగళవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా లక్ష్మీనారాయణను అభినందిస్తూ ఇంజనీర్లు, స్థానిక విద్యుత్ కళాభారతి కళాకారులు పండా రామ్మోహన్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి దుస్సాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లు, మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నాటికి పోటీల్లో కళాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సీలేరు కాంప్లెక్స్‌కి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఈలు శ్రీనివాస్, క్రాంతి, జె.సత్యనారాయణ, శ్రీకాంత్, సూర్య కుమార్, ఏఈలు పవన్ కుమార్, రమేష్, అప్పలనాయుడు, సీతారాం, సబ్ ఇంజనీర్లు శ్రీధర్, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీన చర్యలు ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 168 ప్రాథమిక పాఠశాలలను మూసేయాలన్న ఆలోచనను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషనలైజేషన్, పాఠశాలల విలీనానికి సంబంధించిన జిఓ 117, 128లపై కోర్టులో తుది తీర్పు రాకముందే అనధికారికంగా పాఠశాలలను విలీనం చేయడం సమంజసం కాదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యకు దూరంచేసే నిర్ణయాలు చేయడం సరికాదన్నారు. గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 330 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను కిలోమీటర్ దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని గుర్తుచేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నిష్పత్తికి తగినట్లు ఉపాధ్యాయులను నియమించాల్సిందిపోయి, తరగతులను విలీనంచేసి ఉపాధ్యాయులను మిగులు చూపించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ తప్పుడు విద్యా విధానాల వల్ల పేద విద్యార్థులకు చదువు అందుబాటులో లేకుండా పోతోందని, మరోవైపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లేనందున నిరుద్యోగులకు నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేసిన పాఠశాలల్లో పది మంది కంటే తక్కువున్న ఒకటి, రెండు తరగతులను కిలోమీటర్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానికి సిద్ధపడటం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను విలీనం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రైవేట్ విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర తగదన్నారు.

వాల్తేర్ డిఆర్‌ఎంకు ప్రశంసలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కె.రామ్మోహన్ నాయుడు వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి సేవలను ప్రశంసించారు. రైలు వినియోగదారుల కోసం సౌకర్యాలను మెరుగుపరచడంలో డిఆర్‌ఎం మెరుగైన పనితీరు కనబరిచారని కొనియాడారు. ఈ మేరకు మంగళవారం డిఆర్‌ఎం కార్యాలయంలోనే అనుప్ సత్పతికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలనూ చర్చించారు.